**ఏమికావాలో, ఎలా సాధించాలో తెలుసుకుని ఇతర విషయాలతో నిమిత్తం లేకుండా అందుకోసమే శక్తిసామర్థ్యాలు వినియోగించి కృషిచేసేవాడు ప్రయోజకుడు. అలాంటివాడి గుటు కేవలం ఆ పెరుమాళ్ళకే ఎరుక. ఎంతయినా ఒకొక్కప్పుడు యాదృచ్ఛికమైన సంఘటనలు తట్టుకునే శక్తిమాత్రం అందరికీ ఉండదు**

శేషాద్రి నెత్తిమీద హాటు తీసివేసి, అప్పుడే పెరుగుతున్న బట్టతలమీద కిలకిలలాడుతున్న చెమట బిందువులను రుమాలుతో తుడుచుకుని, పెదవులను నాలుకతో తడుపుకుని; చెట్లకింద నీడలో బువ్వపెట్టుకు తింటున్న కూలీల వంకనుంచి దృష్టి ఆఫీసు బిల్డింగువైపు సాగదీసేటప్పటికి దూరాన నురుగులు కక్కుకుంటూ వస్తున్న ఆఫీసు బంట్రోతు కనుపించాడు.

కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకుని, సగం లేచిన పునాదులమీదుగా, ఆ వస్తున్న వాడివంక చూచి రెండడుగులు ముందుకువేశాడు శేషాద్రి. తాను భోజనం చేసివచ్చి ఎంతోసేపు కాలేదు. పదిపదిహేను నిమిషాలయిందేమో! ఇంతలో ఆఫీసు ప్యూను ఇలా పరిగెత్తుకు రావటం ఎందుకో శేషాద్రికి అర్థంకాలేదు.

ఆఫీసు ప్యూను పరిగెత్తుకునైతే వచ్చాడుగాని, ఆయాసం తీరక తానేమిచెప్పటానికివచ్చాడో అది చెప్పనేలేక పోయాడు. రొప్పుతున్న అతనివంక శేషాద్రి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

ఆఫీసు ప్యూను రామస్వామి రొప్పు అణుచుకుంటూ, "'మీకుటెలిఫోనొచ్చిందిసార్" అన్నాడు.

శేషాద్రి చిరాకు పడ్డాడు. ఊరికి పదిమైళ్ల దూరానఉన్న ఈవర్క్‌స్పాట్‌లో ఎవడోత్రాష్టుడు తనకు టెలిఫోన్ చేయటంతో అతనికి చిరాకనిపించింది. పోనీ ఆ టెలిఫోనన్నా దగ్గరా, దాపునా ఉన్నదా? దాదాపు మూడు ఫర్లాంగుల దూరాన ఉంది. నిప్పులు చెరిగేస్తున్న ఈ ఎండలో అంతదూరం ఆ టెలిఫోనుకోసం పోవాలి.

"ఎవరుచేశారు?" అన్నాడు శేషాద్రి, పోకుండా ఎగగొట్టచ్చులే అనేదానికి నాందిగా.

అయినా ఇంకెవరు చేసి ఉంటారు! వాడే, ఆ త్రాష్టుడు, నిన్నటి వెధవే. ఇక్కడేదో ఉద్యోగాలు ఊరికే పడి ఏడుస్తున్నట్లు ఒక్కటే పీక్కుతినడం, అంత చేటుమొనగాడింకెవరూ లేనట్లు. శేషాద్రికూడా "అబ్బాయ్! ఆట్టే ఆశపెట్టుకోవద్దు. ఏమాత్రమూ లాభంలేదు" అని చెప్పేవాడేగాని, తనను వట్టి చేతకానివాడికింద జమకడతాడేమోనని, "సరేలే, చూద్దాం" అన్నాడు. అంతటితో వదిలితేనా? వేలు దూర్చమంటే కాలుదూర్చే రకం. టెలిఫోను నంబరు కూడా అడిగాడు వెధవ, టెలిఫోనులోనే ఉద్యోగాలు వచ్చేసేటట్లు.

ఆఫీసు ప్యూను, శేషాద్రికి ఏం సమాధానం చెప్పాలో తోచక, "మేనేజరుగారు తమరికి చెప్పమన్నారుసార్. ఇంకా లైనట్లాగే ఉంది" అన్నాడు.

శేషాద్రి సగం అయిష్టంగానే అడుగుతీసి అడుగు వేస్తున్నాడు. వేస్తున్నాగానీ, ఉద్యోగం కోసం తిరిగే ఆ కుర్రవాడి ముఖమే అతనికి తోస్తున్నది. "మేనేజరుగారు మాట్లాడారా?" అన్నాడు మళ్ళీ, ఏదో ఒకటి అడగాలనీ; వాడు కాకుండాఉంటే పీడా వదిలిపోతుందనీని.

ప్యూనుఆయనవెనక, ఆయనఅడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నవాడల్లా రెండడుగులు పక్కకు వేసి, "అవును సార్! ఆయనే మాట్లాడారు. మాట్లాడీ మాట్లాడగానే నన్ను తొందరచేశారు, ఉన్నట్లుగా మిమ్మల్ని తీసుకురమ్మని" అన్నాడు.

శేషాద్రి మనసు కొంచెం కుదుట పడింది. ఇదేదో ఆఫీసు వ్యవహారమే అయి ఉండాలి. లేకపోతే, మామూలుగా అంతగా ఏదీ పట్టించుకోని మేనేజరుగారు తనకోసం ఎందుకు అంత తొందర అని కబురు పెడతారు? ఏది ఏమైనా ఈ ఫోనుమటుకు ఆ త్రాష్టుడి దగ్గరినుంచి కాదన్నమాటే.

మళ్ళీ హాటు తీసి చేతిగుడ్డతో బట్టతల తుడుచుకున్నాడు శేషాద్రి. తుడుచుకుని వెనక్కు ఒక్కసారి చూచాడు. తను కాస్త ఇటుతిరిగితే చాలు, కూలీలు ఎక్కడి పని అక్కడే ఆపి పారేస్తారు. నిజాయితీ అన్నది ఎక్కడేడ్చి చచ్చిందీ? బిళ్ళకుడుముల్లాంటి రూపాయలు బట్వాడా తీసుకుంటారుగానీ, పనికి నడుం వంగిఏడిస్తేనా, వెధవలకు? తోటి ఓవర్సీరులు శేషాద్రిని వట్టి 'సత్తెకాలమ్మనిషి' అంటుంటారు. వాళ్ళ దృష్టిలో పని చేసేవాళ్ళందరూ సత్తెకాలమ్మనుషులే. శేషాద్రి మొగమాటానికి నవ్వి ఊరుకునేవాడు. తన దారి తనది, ఇంకొకళ్లతో తనకెందుకులెమ్మని సరిపుచ్చుకునేవాడు.

ఆలోచిస్తూ నడుస్తున్నాడేమో, శేషాద్రి, ఆఫీసు వచ్చేసినట్లుకూడా గుర్తుపట్టలేదు, ప్యూను "సార్" అని కేకేసేదాకా. ప్యూను వెనక శేషాద్రి ఆఫీసులోకి వచ్చాడు.

అతన్ని చూడగానే మేనేజరు ఎదురువచ్చి, "కర్నూలులో మీ తమ్ముడొకాయన ఉన్నారు కదూ?" అన్నాడు.

శేషాద్రిఔనన్నట్లుతలఊపాడుగానీ, మేనేజరుకు తన తమ్ముడి భోగట్టా ఎందుకు కావలసి వచ్చిందో అర్థంకాలేదు. 'కొంపతీసి పెళ్ళి కావలసిన పిల్లకాని లేదుకదా ఆయనకు!' అనుకున్నాడు. మరుక్షణం ఆ టెలిఫోను చేసింది తన తమ్ముడేమో అనుకున్నాడు. వాడుకాని రాలేదు కదా ఈ ఊరు? అంత అర్జాంతరంగా

చంద్రమౌళి

ఎందుకువచ్చాడో అర్థంకాలేదు. 'వచ్చినా ఇంటికేడవక, పని కట్టుకుని ఇక్కడికెందుకీ టెలిఫోను' అని మనసులోనే విసుక్కున్నాడు.

"అరే, అలా నిల్చునే ఉన్నారే. కూర్చోండి" అన్నాడు మేనేజరు.

శేషాద్రి తాపీగా కూర్చుని పాంట్ జేబులోనుంచి సగంతడిసిన చేతిగుడ్డతీసి, మళ్ళీ బట్టతల తుడుచుకున్నాడు. తుడుచుకుని మేనేజరుగారి వంక చూచి, "వాడుకాని టెలిఫోను చేశాడా?" అన్నాడు.

"అబ్బే, ఆయన కాదండీ. ఆయన స్నేహితుడట... ఎండలో నడిచి వచ్చినట్టున్నారు. మంచినీళ్ళు తాగుతారా?"

శేషాద్రికి తలాతోకా అంతుబట్టటం లేదు. ఇవాళ మేనేజరు తన కెందుకింత గౌరవం ఇస్తున్నాడో అర్థంకావటంలేదు. తన తమ్ముడు పార్థసారథి స్నేహితుడు టెలిఫోను చేయటానికీ, మేనేజరుగారు తనకింత గౌరవం చూపించటానికీ లంగరేమిటో శేషాద్రికి అర్థం కాలేదు. తను ఎండలో నడిచి వచ్చినమాట ఎంత సత్యమో తనకు దాహంవేయటమూ అంత సహజమే. అందుకే రామస్వామి వంక భావయుక్తంగా చూచాడు శేషాద్రి. రామస్వామి గాజుగ్లాసు తొలిచి, మేనేజరుగారి కూజాలోవి, చల్లటి నీళ్ళు తీసి శేషాద్రికి అందిచ్చాడు. శేషాద్రి ఒక్క గుక్కలో గ్లాసు ఖాళీచేసి, "ఇంతకూ అతగా డేమన్నాడో చెప్పనేలేదు మీరు" అన్నాడు మేనేజరువంక చూచి.

మేనేజరుగారు శేషాద్రివంక చూడటానికి ఇష్టంలేనట్లు చూపు బయట నిగుడ్చి, "మీ తమ్ముడుగారు—పాపం, నిన్న పోయారట" అన్నాడు మాటలు నానుస్తూ.

శేషాద్రికి తను విన్న మాటలు నమ్మాలనిపించలేదు. "ఏమిటీ?" అన్నాడు, మిన్ను విరిగి మీద పడ్డట్టు.

అంతమటుకూ పార్థసారథే టెలిఫోను చేశాడనుకుంటున్న ఆయన నివ్వెరపోయాడు. పదిహేను రోజులుకూడా కాలేదు– తనూ, పార్థసారథీ గుంటూరుపోయి, పిల్లను చూచి, స్థిరపరుచుకుని వచ్చి. వచ్చేనెలలోనే పెళ్ళి. శేషాద్రికి ఆలోచనలుస్తంభించిపోయాయి. మేనేజరువంక అలాగే చూస్తూ ఉండిపోయాడు.

"ఆయన మీకోసమే టెలిఫోను చేశాడు. అర్జంటు పని ఉన్నదంటే 'నే చెబుతాలెండి' అన్నాను. ఎంత వయస్సుంటుందేమిటండీ?" అన్నాడు మేనేజరు.

శేషాద్రి తేరుకుని లేచి నిల్చుని, "అబ్బే, ఎంతో వయసుకూడానా! మొన్నీమధ్యనే పాతిక వెళ్ళాయి. జ్యేష్ఠమాసంలో పెళ్ళికూడా అనుకున్నాము. ఇంతలో ఇలా ముంచుకు వచ్చింది" అన్నాడు. అణుచుకున్నా దుఃఖం పొంగుకొస్తూనే ఉన్నది. ఎన్నో ప్రశ్నలు అతని మనసులో రేగి విరిగి పడిపోతూనే ఉన్నాయి.

పార్థసారథి తనకన్నా పదేళ్ళు చిన్న. పార్థ

# స్వార్థం



సారథి పోయాడంటే—? ఎలాపోయాడో? "ఇంకేమైనా చెప్పాడండీ?" అన్నాడు ఉండబట్టలేక.

"అబ్బే. లేదండీ— అతనికీ వివరాలు తెలియవుట. స్టేషనులో ఒక స్నేహితుడు కనపడి మీకు చెప్పమంటే చెప్పాడట. అలా చెప్పాడు" అన్నాడు మేనేజరు.

శేషాద్రి అక్కడ ఇక ఒక్కక్షణం ఉండలేదు. మేనేజరుతోచెప్పి బయలుదేరాడు. ఆ అడవిలో నుంచిఊళ్లోకివచ్చేటప్పటికిమూడుగంటలయింది. ఇంటికి వచ్చి రాగానే సామాను సర్దుకున్నాడు. రాత్రికిగాని రైలు లేదు. అద్దెకారు చేసుకుని కర్నూలు బయలుదేరాడు.

మైలు తరువాత మైలు వెనక పడుతూనే ఉన్నా, శేషాద్రి మనసు మనసులో లేదు. అమ్మ కన్న సంతానంలో తానొక్కడే మిగిలాడు ఇక. మధ్య పిల్లలు పోవటంతో శేషాద్రికీ, పార్థసారథికీ వయస్సులో చాలా తేడా ఉంది. అందులోనూ, ఈతి బాధలతో శేషాద్రి బాగా నలిగిపోయి, ముసలివాడిలా కనుపిస్తుండేవాడు. అందరూ పార్థసారథిని శేషాద్రి కొడుకనుకునేవాళ్ళు. పార్థసారథి మొదటినుంచీ తనమాట వినకుండా తిరిగాడని శేషాద్రికి కోపం లేకపోలేదు. ఉన్నట్టుండి కిందటి సంవత్సరం పార్థసారథి ఆస్తి పంచి ఇవ్వమనికూడా అడిగాడు. శేషాద్రి, ఇక అతనితో తెగతెంపులు చేసుకోవాలనే అనుకున్నాడు. కానీ మళ్ళీ ఎందుకనో పార్థసారథి పంపకానికి ఒప్పుకోలేదు. పార్థసారథి అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడనీ, ఈ సంవత్సరం పెళ్ళి చేసెయ్యాలనీ శేషాద్రి పట్టుపట్టి పార్థసారథిచేత ఒప్పిం

వాడు. అన్ని ఏర్పాట్లూ చేశాడు. కిందటి నెలలోనే పార్థసారథి వచ్చి చూచి, పిల్ల నచ్చిందనే వెళ్ళాడు. ఇప్పుడు హఠాత్తుగా ఈ చావుకబురు తట్టుకోలేకపోయాడు. ఆస్తి పంచమన్నప్పుడు పార్థసారథి మీద ఎంతకోపం వచ్చిందో ఇప్పుడు అంత అభిమానం ముంచుకు వచ్చింది. తను వెళ్ళేదాకా ఉంచుతారో ఉంచరో?

టాక్సీ రయ్యిరయ్యిమని పరిగెత్తుతున్నది. శేషాద్రి మనసుకు సడన్ బ్రేకులు పడుతున్నాయి. పార్థసారథి పోయాడు. ఒక్కగానొక్క తమ్ముడు. ఇక వాడి ఆస్తికూడా తనవంతే. చల్లటి గాలి

# స్వార్థం

వీస్తున్నది. చాలీచాలని జీతంతో బాధ పడుతున్న శేషాద్రి మనసు పుష్పించింది. కిందటి సంవత్సరమే పంచితే ఈపాటికి సర్వ నాశనం చేసి ఉండేవాడు పార్థసారథి. భగవంతుడు ఇదీ ఒకందుకు మంచి పనే చేశాడు.

తను వెళ్ళేటప్పటికి ఉంచుతారో ఉంచరో? అయినా ఎప్పుడు పోయాడో? శేషాద్రి సీటుకు చేరగిలపడ్డాడు. మనసులో అదివరకుదాకా రేగుతున్న ఆందోళన అంతరించింది. ఇదొక తప్పని సరి తద్దినం. ఈ కాస్తదానికి బంధ్యం తిప్పేస్తే సరి. కాళ్ళు కడుక్కోవచ్చు.

అసలు తనింత ఆదరాబాదరాగా టాక్సీలో రాకుండా ఉండవలసింది. రాత్రికి రైలెలాగూ ఉండనే ఉంది. అనవసరంగా తొందర పడ్డాడు. ఈ టాక్సీకి బోలెడు డబ్బవుతుంది. ఈ వివేకం ఇందాకే ఉంటే బాగుండేది. పోయిన వాడు పోగా ఈ టాక్సీలో పడి తను అర్థరాత్రి పోతేమటుకు జరిగేదేమిటి?

టాక్సీ కర్నూలు చేరేటప్పటికి అర్థరాత్రి అయింది. పార్థసారథి అదివరకు ఉన్న గది దగ్గరకు వెళ్ళేటప్పటికి గదికి తాళం వేసి ఉన్నది. హాస్పిటల్లోగాని పోలేదు కదా? అన్న అనుమానం కలిగింది శేషాద్రికి. పక్క ఇంట్లో ఇంకా లైటు వెలుగుతూనే ఉంది. వాళ్ళ నడిగితే తెలుస్తుందేమో అన్న ఆలోచన కలిగి, తలుపుతట్టాడు శేషాద్రి. ఎవరో తలుపు తీశారు. వాళ్ళు తలుపు తీసీ తీయగానే, "ఈ పక్క గదిలో ఉండే పార్థసారథి..." అన్నాడు శేషాద్రి. ఇక్కడదాకా వచ్చాక తమ్ముడిమీద అభిమానం కొద్దిగా తగ్గుతోంది. ఇందాక తమ్ముడి ఆస్తిమీద కలిగిన వ్యామోహం తలపుకు వచ్చి బాధ అనిపించింది.

"ఇదుగో. ఇక్కడే ఉన్నారు" అన్నాడు తలుపు తీసినాయన శేషాద్రి మాటలు తుంచి వేస్తూ. ఇంతలో చేతిలో పేకముక్కలతో పార్థసారథి లేచి రానేవచ్చాడు. శేషాద్రికి మతి పోయినంత పనయింది. ఎదురుగా సజీవంగా నిల్చున్నాడు పార్థసారథి. అతనూ ఆశ్చర్యంగా చూచి, "రా, అన్నయ్యా" అన్నాడు తన గదివైపు దారి తీస్తూ.

ఆ పూటకు ఉండి, తిరిగి మధ్యాహ్నం రైల్లో హైదరాబాదు చేరుకున్న శేషాద్రి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, వర్క్‌షాపుకు ఉడాయించాడు.

శేషాద్రిని చూస్తూనే మేనేజరు "అరే, అప్పుడే డ్యూటీకి వచ్చారే?" అన్నాడు.

"అది సరేగాని, అసలు నిన్న టెలిఫోను చేసినవాడు పేరేమైనా చెప్పాడా?" అన్నాడు ఎదురు ప్రశ్న వేస్తూ శేషాద్రి.

"శంకరమని చెప్పినట్టు గుర్తు" అని నాన్నాడు మేనేజరు.

"శంకరమా! వాడా! తన సేదో కీడు మూడబోతున్నదని, అబద్ధపు చావు కబురు అందజేశాడు, వెధవ" అని పళ్ళు కొరికాడు శేషాద్రి—తను ఊహించిన కారణాన్ని నిజమని నొక్కి చెబుతూ.

"అయితే ఇంతకూ..." అన్నాడు మేనేజరు.

"ఆహా! మా తమ్ముడు సలక్షణంగానే ఉన్నాడు" అని పూర్తిచేశాడు శేషాద్రి.

పార్థసారథికి పుటుకు అసలు తన అన్న అంత హఠాత్తుగా ఎందుకు వచ్చిందీ, ఎందుకు వెళ్లిందీ ఇంతవరకూ తెలియదు. ★





## నారసింహ లేహ్యం

అత్యుష్ణము, బలహీనతల హరించి ధాతువృద్ధి, బలము కల్గించును. డబ్బి రు. 3—50

**రోజాపుష్ప లేహ్యం**

మలబద్ధము పోగొట్టి సాఫీ విరేచనము, జీర్ణశక్తి కల్గించును. 1 డబ్బి రు. 1—25

**సర్బిట (మకరధ్వజతో)**

నరములు బలహీనత పోగొట్టి రక్తవృద్ధి, ధాతు శక్తి కల్గించును. 1 సీసా రు. 6—75

పెద్ద క్యాట్లాగు ఉచితము.

వి.ఓ.వి. & కో, పెరిదేపి, నెల్లూరుజిల్లా.

